నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 100 | శనివారం, 11 సెప్టెంబర్ 2026 | పేజీలు -4 | వెల : 3/-




# గణేష్ ఆగయా

## ఖైరతాబాద్ రెడీ!

- రేపటి నుంచి గణపతి దర్శనం
- 69 అడుగుల ఎత్తులో గణనాథుడు
- మండపం వద్ద భారీ ఏర్పాట్లు

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 14న వినాయక చవితి వేడుకలు జరగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం 12వ తేదీ నుంచే మహాగణపతి దర్శనాన్ని ప్రారంభించనున్నారు. ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకునేందుకు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

వాస్తవ తెలంగాణ



### 69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి

ఈ ఏడాది ఖైరతాబాద్‌లో 69 అడుగుల ఎత్తుతో పంచముఖ సంకటహర మహాగణపతి కొలువుదీరాడు. భారీ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా, పంచముఖ గణపతి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది. గణనాథుడి దర్శనానికి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

### సోమనాథ్.. కాళీమాత ప్రత్యేక ఆకర్షణ

మహాగణపతి విగ్రహానికి ఇరువైపులా ప్రత్యేక ఆధ్యాత్మిక నమూనాలను ఏర్పాటు చేశారు. ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు అమ్మవారి శక్తిరూపమైన కాళీమాత విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన గణనాథుడితో పాటు ఈ ప్రత్యేక రూపాలు కూడా భక్తులను ఆకట్టుకోనున్నాయి.

### పర్యావరణహితంగా మహాగణపతి

ఈసారి గణనాథుడి విగ్రహాన్ని పర్యావరణహితంగా రూపొందించారు. సహజ నదీమట్టి, ఇసుక, వరి గడ్డి వంటి సహజ పదార్థాలను ఉపయోగించడంతో పాటు సేంద్రియ రంగులతో విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు తెలిపారు. నిమజ్జనం సమయంలో పర్యావరణంపై ప్రభావం తగ్గించేలా నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### నేడు ఘనంగా ఆగమన వేడుకలు

ఖైరతాబాద్ మహాగణపతి ఆగమన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం శనివారం నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఇప్పటికే విగ్రహ నిర్మాణం పూర్తికావడంతో ఖైరతాబాద్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్, క్యూలైన్లు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



# అటవీ అమరవీరుల సంస్మరణ దినం

- వారి త్యాగాలు చిరస్మరణీయమన్న సీఎం రేవంత్

వాస్తవ తెలంగాణ అటవీ సంపద, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ అమరులైన అటవీ శాఖ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారి సేవలను స్మరించుకున్నారు. అడవులు, వన్యప్రాణులను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన అటవీ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని సీఎం కొనియాడారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరవీరులు చూపిన మార్గంలో ముందుకు సాగుతూ అడవులను కాపాడాలని, వన్యప్రాణులను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని, భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?



రంగారెడ్డి : **వాస్తవ తెలంగాణ** సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి రూ. 250 కోట్ల విలువైన భూమిని రూ. 7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు కనిపించడం లేదా' అని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రాంతంలో కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములను గురువారం కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు. మరి తెలంగాణను కొల్లగొడు తున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు...? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని ప్రశ్నించారు. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా, కుటుంబ పాలన కాదా అని ఆయన నిలదీశారు. ఎనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ. 1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూము లు, మినహాయింపులు కల్పించే వ్యవహా రంపైనా ప్రశ్నలు సంధించారు. సీఎం సోదరుడి సంస్థ ఇజ్రాయిల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని ఆరోపించారు. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చామని, ఇక్కడి నుంచే ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నామని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయా జాలం నడుపుతున్నదని ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగిం చడం చట్టపరంగా ప్రశ్నార్థకమని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం



## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ

వాస్తవ తెలంగాణ : వ్యవసాయ పంప్‌సెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని, ఉచిత విద్యుత్ కొనసాగుతుందని శాసనమండలిలో స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఎస్ పథకంలో వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన లేదని తెలిపారు. విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ, ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ అప్‌గ్రేడ్ కోసం కేంద్రం 60 శాతం గ్రాంట్ ఇస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఉదయ్ ఒప్పందానికి మించి ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సెప్టెంబర్ 9న రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని భట్టి తెలిపారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ద్వారా తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల విద్యుత్ వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సోలార్ పంప్‌సెట్లను పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేస్తున్నామని, రైతులు అంగీకరించకపోతే ప్రస్తుత ఉచిత విద్యుత్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి ఉచిత బీమా!

- రాష్ట్రంలో 12.91 లక్షల మందికి ప్రయోజనం
- ఇప్పటికే 89 కుటుంబాలకు పరిహారం
- శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూపాయి ప్రీమియం లేకుండా రూ.కోటి వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జీవో నంబర్ 77 ద్వారా అమలు చేస్తున్న ఈ పథకంతో రాష్ట్రంలో 12.91 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటివరకు 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం అందించినట్లు తెలిపారు. ఇందులో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు 50, విద్యుత్ శాఖకు చెందినవి 15, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందినవి 24 ఉన్నాయని వివరించారు. బ్యాంకుల శాలరీ, పెన్షన్ ఖాతా ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని, ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం వంటి సందర్భాల్లో కవరేజ్ ఉంటుందని చెప్పారు. విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2.20 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా లభిస్తుందని వెల్లడించారు. ఈ పథకాన్ని తొలుత 2024 ఫిబ్రవరిలో సింగరేణి ఉద్యోగులకు, జూన్‌లో విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ఇతరులకు విస్తరించినట్లు భట్టి తెలిపారు.

# 10 గ్రామాల్లో 13 వేల ఎకరాల్లో రీ-సర్వే పూర్తి

## గడువులోగా ఖచ్చితత్వంతో పనులు పూర్తి చేయాలి

## సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** జిల్లాలో కొనసాగుతున్న కాడాస్ట్రల్ రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో బావయ్య, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలిసి రీ-సర్వే పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 10 గ్రామాల్లో 13 వేల ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సర్వేను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్వే బృందాల రోజువారీ పనితీరు, ఒక్కో బృందం సాధిస్తున్న పురోగతి, రోజువారీగా పూర్తవుతున్న విస్తీర్ణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వేలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా పనులు చేపట్టాలని ఆదేశించారు. భూ రికార్డులను శాస్త్రీయంగా, పారదర్శకంగా రూపొందించడంలో కాడాస్ట్రల్ రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఒకరికి నేర్పుదాం పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో జ్ఞాన వినిమయ కార్యక్రమం

**మేడ్చల్, వాస్తవ తెలంగాణ న్యూస్:** తరగతి గదిని దాటి సాగిన ఓ గొప్ప పాఠంగా "ప్రతి ఒక్కరూ ఒకరికి నేర్పుదాం (Each One Teach One)µµ కార్యక్రమాన్ని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్, గౌడవెల్లి ఆధ్వర్యంలో దత్తత పాఠశాలైన శ్రీరంగవరం పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తమ జ్ఞానం, ఆలోచనలు, అనుభవాలను శ్రీరంగవరం పాఠశాల విద్యార్థులతో పంచుకున్నారు. ఉపాధ్యాయుల చురుకైన సహకారం, మార్గదర్శకత్వంతో ఈ కార్యక్రమం అందమైన జ్ఞాన వినిమయ వేదికగా మారింది. ఇతరులకు బోధించడం ద్వారా కలిగే ఆనందాన్ని విద్యార్థులు అనుభవించడంతో పాటు, సమాజానికి తమ వంతు సహాయం చేయడం, ఇతరుల పట్ల శ్రద్ధ చూపడం, పంచుకోవడం వంటి విలువలను నేర్చుకున్నారు.







ఈ సందర్భంగా శ్రీరంగవరం పాఠశాలకు అవసరమైన స్టేషనరీ వస్తువులను విరాళంగా అందజేశారు. ఈ చిన్న సహాయం విద్యార్థుల్లో దయ, సేవాభావం, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనలను పెంపొందించింది. ఈ కార్యక్రమం కేవలం విద్యను పంచుకోవడానికి పరిమితం కాకుండా, సానుభూతి, కృతజ్ఞత, దయ, పంచుకునే మనస్తత్వం వంటి జీవిత విలువలను నేర్పిన గొప్ప అనుభవంగా నిలిచింది. విద్యార్థులు తమకు లభిస్తున్న వనరులు, అవకాశాల పట్ల కృతజ్ఞతతో ఉండటంతో పాటు, తమ జ్ఞానం మరియు వనరులను ఇతరులతో పంచుకోవడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని తెలుసుకున్నారు. మా సందేశం: "విద్య అంటే పుస్తకాల నుంచి నేర్చుకోవడం మాత్రమే కాదు; శ్రద్ధ చూపడం, పంచుకోవడం, సహాయం చేయడం, ఇతరుల జీవితాల్లో మార్పు తీసుకురావడం కూడా." జ్ఞానాన్ని పంచుకుందాం -- అవకాశాలను పెంచుదాం -- సమాజాన్ని బలోపేతం చేద్దాం!

# కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి పోలీసుశాఖ అండ

## రూ. 4.21 లక్షల ఆర్థిక సాయం చెక్కు అందజేత.

## భార్యకు ఉద్యోగం వచ్చేలా చర్యలు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు.



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివంపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి జిల్లా పోలీసుశాఖ అండగా నిలిచింది. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి సేకరించిన రూ. 4.21 లక్షల ఆర్థిక సాయం చెక్కును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఐపీఎస్ మహిపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కొన్ని రోజుల క్రితం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిపాల్ మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ వంతు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మహిపాల్ కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. మీరు కూడా పోలీసు కుటుంబంలో భాగమే. ఏ సమస్య వచ్చినా నేరుగా నన్ను సంప్రదించండి. పోలీసుశాఖ అన్ని విధాలా అండగా ఉ ంటుంది అని భరోసా ఇచ్చారు. మహిపాల్ శాలరీ అకౌంట్ ద్వారా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిపాల్ భార్యకు ఉద్యోగం త్వరగా వచ్చేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి మహిపాల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# 51% ఫిట్‌మెంట్ ప్రకటించాలి

## పెండింగ్ డీఏల్లో మూడు వెంటనే విడుదల చేయాలి.

## సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి.

## పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్. మల్లారెడ్డి



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్. మల్లారెడ్డి కోరారు. పీఆర్సీ చైర్మన్ శివశంకర్ నుంచి నివేదికను వెంటనే తెప్పించి, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హవేలీఘన్‌పూర్ మండలంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపుల కోసం ప్రతి నెలా రూ. 2 వేల కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందుకోసం ఎలాంటి కమిటీలు ఏర్పాటు చేసి కాలయాపన చేయవద్దన్నారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులు అన్ని ఆసుపత్రుల్లో పనిచేసేలా విధివిధానాలను వెంటనే ఖరారు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో మండల అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డితో పాటు జిల్లా, మండల బాధ్యులు సంగమేశ్వర్, నందరాం రఘుబాబు, త్యార్ల శ్రీనివాస్, సంతోష్, ప్రేమ్‌కుమార్, బొగ్గుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ గేమ్స్ లో సత్తా చాటిన శ్రీ సాయి చైతన్య స్టూడెంట్స్...



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్.** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని శంకరంపేట మండల పరిధిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ గేమ్స్ లో శ్రీ సాయి చైతన్య స్కూల్ స్టూడెంట్ సత్తా చాటారు. అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ గేమ్స్ లో శ్రీ సాయి చైతన్య హై స్కూల్ బాలురు,బాలికలు మండల్ సెకండ్ ప్రైజ్ సాధించి శభాష్ అనిపించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్స్ గంగాధర్ గౌడ్, భూమేశ్వర గౌడ్, ప్రిన్సిపల్ శ్రీకర్ గౌడ్ మాట్లాడుతూ స్టూడెంట్స్ ను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా తయారు చేయడమే శ్రీ సాయి చైతన్య స్కూల్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన స్టూడెంట్స్ కు శుక్రవారం మెడల్స్,మెమెంటోలు అందజేశారు. క్రీడారంగంలో అనునిత్యం స్టూడెంట్స్ ను ప్రోత్సహిస్తున్న పీఈటి నవీన్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# రోడ్డు పయి వీరిగిన భారీ చెట్టు




**వాస్తవ తెలంగాణ టేక్మాల్** టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రహదారికి ఇరువైపులా వాహనదారులకు, ప్రజలకు ఆటంకంగా మారిన చెట్లను, ముళ్ల పొదలను సర్పంచ్ టి. సుధాకర్ గారి ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. జెసిబి (జీజదీ) యంత్రం సహాయంతో రోడ్డు పక్కన ఉన్న పొదలు, వ్యర్థాలను తొలగించి, మార్గాన్ని సుగమం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్ తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ మరియు ప్రమాదాల నివారణకు ఈ చర్య ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామపంచాయతీ నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేసినందుకు ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**టేక్మల్ వాస్తవ తెలంగాణ** మండల పరిధిలోని సర్పంచ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ గ్రామపంచాయతీల నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేయడంతో పాటు, పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ట్రెజరీలో కాకుండా నేరుగా గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునే అవకాశం కల్పించడం హర్షణీయం.అలాగే పంచాయతీరాజ్ చట్టం--2018 సవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం ద్వారా గ్రామపంచాయతీలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ, అభివృద్ధికి అవసరమైన వెసులుబాటు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రంలోని సర్పంచుల తరఫున స్వాగతిస్తున్నాము. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ కి, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ కి రాష్ట్రంలోని సర్పంచులందరి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ, నిధుల వినియోగంలో మరింత పారదర్శకత మరియు స్వేచ్ఛ కల్పించడం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపట్టేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయి.అదేవిధంగా భవిష్యత్తులో కూడా గ్రామపంచాయతీల సమస్యలను పరిష్కరిస్తూ, సర్పంచులకు మరిన్ని అధికారాలు, నిధులు మరియు నిర్ణయాధికారాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాము.

# కోతుల బెడదకు చెక్ పెట్టాలి

**ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా పటిష్ట చర్యలు.. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** కోతుల బెడద నుంచి ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్లు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా కోతుల బెడద నివారణపై సమీక్ష నిర్వహించారు.గత సమావేశంలో సూచించిన అంశాలపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కోతులను యుద్ధప్రాతిపదికన పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అక్కడ ఆపరేషన్ అనంతరం వాటిని అడవుల్లో వదిలేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యలతో ప్రజలు, రైతులకు కోతుల బెడద నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. కోతుల నియంత్రణను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. సమస్యను గణనీయంగా నియంత్రించేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమన్నారు. మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి విధానాన్ని వ్యతిరేకిస్తూ శివంపేట సర్వీస్ రోడ్డుపై పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన





**చౌటకూర్://వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి సెప్టెంబర్ 11** పాలిటెక్నిక్ కళాశాలలో అమలు చేస్తున్న శక్తి విధానాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. మండలంలోని శివంపేట గ్రామం వద్ద గల సర్వీస్ రహదారిపైకి వెళ్లి నిరసన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపే నిర్ణయాలను పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేశారు.తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. విధానంలో ఉన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తమ చదువులకు ఆటంకం కలిగించే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం, సాంకేతిక విద్యాశాఖ అధికారులు వెంటనే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఇంక్రిమెంట్‌లో వివక్ష ఎందుకు..?

**చౌటకూర్ ఈఎంపీఈఈ డిస్టిలరీ గేటు ముందు కార్మికుల ఆందోళన**
**- 90 మంది పర్మినెంట్ కార్మికుల్లో 17 మందికే స్పెషల్ ఇంక్రిమెంట్**



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి సెప్టెంబర్ 11** చౌటకూర్: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమలో వేతనాల పెంపు, ఇంక్రిమెంట్ల విషయంలో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై పర్మినెంట్ కార్మికులు ఆందోళనకు దిగారు. పరిశ్రమలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులు మొత్తం 90 మంది ఉండగా, వారిలో కేవలం 17 మందికి మాత్రమే స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వడంపై మిగిలిన కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందరికీ సమానంగా ఇంక్రిమెంట్ ఇవ్వడంతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ గేటు ఎదుట నిరసన చేపట్టారు.

**90 మందిలో 17 మందికే పెంపు**

పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా పర్మినెంట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాల పెంపు విషయంలో అన్యాయం జరుగుతోందని కార్మికులు ఆరోపించారు. మొత్తం 90 మంది పర్మినెంట్ కార్మికుల్లో 17 మందికి మాత్రమే స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వడం వల్ల మిగిలిన కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఒకే పరిశ్రమలో ఒకే విధమైన బాధ్యతలు నిర్వహిస్తున్న కార్మికుల మధ్య వేతనాల విషయంలో వ్యత్యాసం చూపడం సరికాదని పేర్కొన్నారు.**వేతనాలు పెంచాలని డిమాండ్** పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ వేతనాలను పెంచాలని కార్మికులు కోరుతున్నారు. కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఇతర ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత వేతనాలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని తెలిపారు. అందువల్ల అర్హత ఉన్న ప్రతి పర్మినెంట్ కార్మికుడికి న్యాయమైన ఇంక్రిమెంట్ అందించాలని డిమాండ్ చేశారు.

**యాజమాన్యం స్పందించాలంటూ ఆందోళన**

ఇంక్రిమెంట్ విషయంలో నెలకొన్న సమస్యను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కార్మికులు కోరారు. 17 మందికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇచ్చిన విధానాన్ని స్పష్టం చేయడంతో పాటు మిగిలిన కార్మికులకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోకుండా



సమస్యను జాప్యం చేస్తే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. కార్మికుల సమస్యపై యాజమాన్యం చర్చలు జరిపి, అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కార్మికుల ఆందోళనకు చౌటకూర్, సరాఫ్ పల్లి సర్పంచులు పార్కల రాంరెడ్డి, రామచంద్రారెడ్డిలు సంఘీభావం తెలిపారు.

# సమాజంలో మహిళలకు భద్రత కరువు

**-మహిళా ఎమ్మెల్యేలపైన జరిగిన దాడి దీనికి నిదర్శనం**
**-ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ అనుబంధ సంఘాల జిల్లా మహిళా అధ్యక్షురాలు పల్లె పాటి మాధవి మాదిగ**





**మెదక్ తూప్రాన్ వాస్తవ తేలంగాణ ప్రతినిధి సెప్టెంబర్ 11:-** ఇటీవల తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభ రోజు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి సబితా ఇంద్రారెడ్డి లపై జరిగిన దాడి హేయమైన చర్య అని మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ అనుబంధ సంఘాల మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి మాదిగ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ అనుబంధ సంఘాల మాదిగ మహిళ సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి యావత్ తెలంగాణ మహిళాలోకానికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు బాధ్యత వహిస్తూ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెల్సీ స్థాయి వారికే ఇలాంటి అవమానం జరిగితే మరి సామాన్య మహిళల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్ని మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఏదో ఒక మూలన మహిళలు అవమానాలు ఎదుర్కొంటున్నారని వెంటనే మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు నివారించడానికి స్పెషల్ టీం ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఎంఎంఎస్ విభాగం మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి పల్లెపాటి మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకురాలు పల్లవి బిసి, జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పేట పుష్ప మాదిగ, నూతన జిల్లా కమిటీ మహిళా నాయకురాలు ముక్క జ్యోతి , పి. అమృత మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల హియరింగ్‌కు ఈనెల 12, 13 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు మున్సిపల్ కమిషనర్ యోగేష్ వెల్లడి

**శంకర్‌పల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. నోటీసులు అందుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల హియరింగ్‌కు హాజరు కాలేకపోయిన ఓటర్ల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో మున్సిపల్ కౌన్సిలర్లు కూడా పాల్గొంటారని తెలిపారు. ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలని, కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6, పేరు తొలగింపు, సవరణలు మరియు ఇతర మార్పుల కోసం ఫారాలు 7, 8 సమర్పించాలని కోరారు. మిగిలిన అర్హులైన ఓటర్లు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కమిషనర్ యోగేష్ విజ్ఞప్తి చేశారు.



# కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు పెండింగ్ కేసులను గడువులోగా పూర్తి చేయాలి

## వినాయక చవితికి పటిష్ఠ బందోబస్తు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు




**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించారు. కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా దర్యాప్తు పూర్తి చేసి సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. గ్రేవ్ కేసుల్లో సంఘటనా స్థలంలో ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని సూచించారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను వినియోగించి నిందితులకు శిక్షపడేలా బలమైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధితుల ఆచూకీ గుర్తించాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.




గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసమావేశంలో డీఎస్పీలు సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌గౌడ్, సీఐలు రేణుక, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, జార్జ్, సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగా కృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ పార్టీ ఎం.ఎల్.సి.తథా మధు,పావని గౌడ్ ల పై చట్ట పరమైన చర్య తీసుకోవాలి - ఎం.వి.దేవేందర



**వాస్తవతెలంగాణా డైలీ న్యూస్** /.అల్వాల్ :మొన్న తెలంగాణ శాసనసభపతి గడ్డం హరి ప్రసాద్ గారి పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన ఎం.ఎల్.సి.తథా మధు పై బి.ఆర్.ఎస్.పార్టీ అధినేత స్పందించక పోవడంతో దళితులు కె.సి.ఆర్ ఫార్మ్ హౌస్ కు డప్పులతో నిరసనగా వెళ్లిన సందర్భంలో బి.ఆర్.ఎస్ నాయకులు దళితుల నడిచిన నెల అప అపవిత్రం అయినది అని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్నాము అని దళితులను రక్షసులతో పోల్చి మా దళితులను మానసిక క్షోభకు గురి చేసిన పావని గౌడ్ మరియు ఆమె వెంట ఉన్న నాయకులను ఉర్ధించి వారి పై ఎస్.సి, ఎల్.టి చట్టం ప్రకారం చర్య తీసుకోవాలని ఈ రోజు అల్వాల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షులు ఎంవి దేవేందర్ ఆధ్వర్యంలో అల్వాల్ పోలీస్ స్టేషన్లలో పిర్యాదు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏ.వి.దేవేందర్ మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ ముందునుంచి దళిత వ్యతిరేక పార్టీ అని ఆ పార్టీ అధినేత ఆదేశాల మేరకే ఆ పార్టీ నాయకులు దళితులను టార్గెట్ చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తంచేశారు మరియు ఆ పార్టీ అధినేత ను ఉద్దేశించి మీరు దళితుల వోటు తో ఎమ్మెల్యే గా ఎన్నికై ఆ తరువాత సి.ఎం అయిన సంగతి మర్చిపోవద్దు అనిఇలాంటి పునరావృతం కాకుండా చూసుకోవాలి అని కె.సి.ఆర్.కు హితవుపలికారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్యకిరన్,శ్యామసుందర్,గాయత్రి వీనస్ మేరీ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

# దుండిగల్ సర్కిల్ దొమ్మర పోచంపల్లి లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

## అనధికార కట్టడాల కూల్చివేత నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న డిప్యూటీ కమిషనర్

**దుండిగల్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు** నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ, అనధికార నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గత కొన్ని రోజుల నుండి కొరడా ఝుళిపించారు. భవన నిర్మాణ అనుమతులను ఉల్లంఘించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలను గుర్తించి కూల్చివేత చర్యలు చేపట్టారు. దొమ్మర పోచంపల్లి లో అదనపు అంతస్తు పై చర్యలు దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి ప్లాట్ నెంబర్ 74, సర్వేనెంబర్ 194/3,194/4,212/2 లో భవన నిర్మాణానికి జీ+2 అనుమతి తీసుకుని, అందుకు విరుద్ధంగా జీ+4 నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు భాగంపై అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు.

**అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం**

ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే ఎలాంటి నిర్మాణాన్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్న తర్వాత వాటికి విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.




**నిఘా మరింత తీవ్రతరం**

దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాల్లో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారితో పాటు, ఒక విధమైన అనుమతులు తీసుకుని అనంతరం అదనపు నిర్మాణాలు చేపడుతున్న వారినీ గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఉల్లంఘనలకు చెక్**

భవన నిర్మాణ అనుమతులు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితేవాటిని గుర్తించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**కూల్చివేతలు కొనసాగుతాయి**

దుండిగల్ సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలపై తనిఖీలు, నిఘా కొనసాగుతాయని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలను గుర్తించి, చట్టపరమైన నిబంధనల మేరకు కూల్చివేత చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్తో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ ఘనంగా వర్ధంతి వేడుకలు

-స్థానిక యువత మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి
-రజక సంఘాల ఉమ్మడి తెలుగు రాష్ట్రాల జేఏసీ చైర్మన్ పంజాగారి ఆంజనేయులు




**మేడ్చల్ వాస్తవ తెలంగాణ ప్రతినిధి శ్రీనివాస్ చారి సెప్టెంబర్ 11:-** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ గ్రంథాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మన్ పంజా గారి ఆంజనేయులు ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి టెంకాయలు కొట్టి పుష్పాభిషేకం చేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రజక సంఘాల రాష్ట్ర జేఏసీ నాయకులు మాట్లాడుతూ... ఐలమ్మ తాము బ్రతకడానికి ఒక జమీందారు పొలాన్ని కౌలుకు తీసుకొని విత్తు నారు నీరు కోసం చెమటోడ్చి పండించిన పంటను అప్పటి నిజాం సర్కారు భూమి శిస్తు పేరుతో దౌర్జన్యంతో ఎత్తుకెళ్లే సమయంలో ఎదురొడ్డి తాము పండించిన పంటను కాపాడుకోవడంలో సఫలమయ్యారని పేర్కొన్నారు.వీరనారి ఐలమ్మ జీవిత చరిత్రను రాబోయే తరాల వాళ్లు యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అలాగే గాంధీభవన్ లో రవీంద్ర భారతి లో జరిగిన ఇట్టి కార్యక్రమానికి ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఏర్పాటు చేయగా అట్టి కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బిసి ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి అంజయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించాలి

## -మేడ్చల్ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన మేడ్చల్ జిల్లా భాజపా నాయకులు



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ ప్రతినిధి సెప్టెంబర్ 11:-** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించాలని మేడ్చల్ తహసిల్దారు కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ నరేష్ కు అలాగే ఎల్లంపేట్ మున్సిపాలిటీ కమిషనర్ కు భారతీయ జనతా పార్టీ ఎల్లంపేట్ మున్సిపాలిటీ అద్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా భాజపా ఉపాధ్యక్షులు ఎల్లంపేట జగన్ గౌడ్, ఎల్లంపేట మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ....సెప్టెంబర్ 17వ తేదీ మన తెలంగాణ ప్రాంత చరిత్రలో ఎంతో విశిష్టమైనదని గర్వకారణమనీ, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం సంస్థానం నిజాం పాలన నైజాం రజాకార్ల నిర్బంధం నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు.అమరవీరుల త్యాగాలు,పోరాటయోధుల వీరత్వ ఫలితంగా మనకు స్వేచ్ఛ,ప్రజాస్వామ్యం సిద్ధించాయని,ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని స్మరించుకోవడం,అమరుల త్యాగాలకు నివాళులు అర్పించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.సెప్టెంబర్ 17న మన మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు,అధికారులు,స్థానిక ప్రజలు మరియు విద్యార్థుల భాగస్వామ్యంతో అధికారికంగా జాతీయ జెండా ఆవిష్కరణ స్మారక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు కొరివి పోచయ్య,24 వార్డ్ కౌన్సిలర్ అర్చన శ్రీనివాన్,2 వార్డు కౌన్సిలర్ శారద రాజు నాయక్, భాజపా మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు రవి నాయక్,ఆంజనేయులు,లక్ష్మణ్,పద్మారావు,సత్యనారాయణ, ప్రవీణ్ ముదిరాజ్,దివాకర్ రెడ్డి,వినయ్ చారి,స్వామి,తదితరులు పాల్గొన్నారు

# లంబాడి నాయకులను ముందస్తు అరెస్టు




**వాస్తవ తెలంగాణ సెప్టెంబర్ 11 నాగరాజు యాదవ్ ప్రతినిధి** మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షులు నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా లంబాడీల హక్కుల కోసం సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరము అడవిలో కాకుండా హైదరాబాదులో ఉండాలని ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని విద్యార్థుల స్కాలర్షిప్ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి గిరిజన విద్యార్థి సంఘం పిలుపుమేరకు కార్యక్రమానికి ముందస్తుగా అరెస్టు చేశారు అరెస్టు చేసిన వారిలో తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ దిగావత్ శివ నాయక్ తదితరులు ఉన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794

# కేసీఆర్ ఫామ్ హౌస్ ను దళితులు ముట్టడించడం ఎంతవరకు సమంజసం

## –బీఆర్ఎస్ తూప్రాన్ మున్సిపల్ యువ నాయకులు ప్రశాంత్




**తూప్రాన్ వాసవ తెలంగాణ ప్రతినిధి బి నాగరాజు యాదవ్ సెప్టెంబర్ 11:–** బీఆర్ఎస్ వ్యవస్థాపకులు తెలంగాణ రాష్ట్ర సాధకులు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఫామ్ హౌస్ ను దళితులు ముట్టడించడం ఎంతవరకు సమంజసం అని తూప్రాన్ మున్సిపల్ టిఆర్ఎస్ యువ నాయకులు ప్రశాంత్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో దళితులకు పెద్దపీట వేసి దళిత బంధు అందజేశారని దళితుల అభివృద్ధి కోసం ఉపాధి అవకాశాల కోసం కృషి చేశారని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టడంతో దళితులు కేసీఆర్ ఫామ్ హౌస్ ను ముట్టడించినట్లు ఆరోపించారు. వెంటనే దళితులు కేసీఆర్కు టిఆర్ఎస్ పార్టీ నాయకత్వానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో అష్ట కష్టాలు పడుతున్నారని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తిరిగి మళ్లీ మొదలవుతాయని రాష్ట్ర అభివృద్ధి కేవలం బిఆర్ ఎస్ పార్టీతోనే సాధ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు.

# బీఆర్ఎస్‌లోకి అట్టేపల్లి రామప్రభు

## కేటీఆర్ సమక్షంలో ఘనంగా చేరిక

## శేరిలింగంపల్లిలో రాజకీయంగా కొత్త ఊపు



**మియాపూర్, సెప్టెంబర్ 11 (వాస్తవ తెలంగాణ):** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అట్టేపల్లి రామప్రభు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. భారీగా చేరిన అనుచరులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సీనియర్ నాయకులు మాధవరం రంగారావు, సిద్ధనబోయిన పురుషోత్తం యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామప్రభుతో పాటు అడప అజయ్, సోంటెనా గంగాధర్, రాజు, రాజేష్, శ్రీశైలం తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రజా సేవే లక్ష్యం ఈ సందర్భంగా రామప్రభు మాట్లాడుతూ.. "పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయడానికి రాజకీయాల్లోకి వచ్చాం. ప్రజల నమ్మకమే మా బలం" అని తెలిపారు. ఆయన చేరికతో శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరుతుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో మారబోయిన రవికుమార్ యాదవ్, కలిదిండి రోజా, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీజేఎంయు ఆధ్వర్యంలో మేడ్చల్ బస్ డిపో వద్ద సమావేశం

## –కార్మికుల సంక్షేమానికి మద్దతుగా మేడ్చల్ జిల్లా భాజపా నేతలు



**మేడ్చల్ వాసవ తెలంగాణ ప్రతినిధి సెప్టెంబర్ 11:–** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కేంద్రమైన మేడ్చల్ లో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ మేడ్చల్ డిపో సమావేశం మేడ్చల్ డిపో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ హనుమంత్ ముదిరాజు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీవీకే రావు,రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్, ప్రేమ్ సాగర్ శ్రీనివాస్ మాధవి అలాగే మేడ్చల్ డిపో గౌరవ అధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్,డిపో కమిటీ అధ్యక్షులు నరసింహ, సెక్రటరీ శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి సాదిక్ పాషా,ఉపాధ్యక్షులు శేఖర్, సంఘం నాయకులు సునీత,పద్మ,గణపతి,సంతోష్ శ్రీనివాస్,యాదగిరి,కవిత,సంధ్యారాణి,అనురాధ,యశోదగోపాల్, రామక్రిష్ణ,వీరస్వామి,బాబు ,సురేష్,గోవింద్ డ్రైవర్లు కండక్టర్లు పాల్గొన్నారు . ఇట్టి కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా బిజెపి నేతలు మాజీ జడ్పీటీసీ సభ్యులు మేడ్చల్ డివిజన్ భాజపా అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఎల్లంపేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్,ఉపాధ్యక్షులు దేవందర్ రెడ్డి ,నాయకులు వంశీ,విజయ్,రాఘవ రెడ్డి, మహేశ్ గౌలికర్, లక్ష్మణ్ యూనియన్ సభ్యులకు మద్దతు తెలిపారు..

# సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారంగా నిర్వహించాలి..

## -ఎంఆర్ఓ కి వినతి పత్రం అందించినా బీజేపీ నాయకులు..



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ బిజెపి నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో, సెప్టెంబర్ 17ను ''తెలంగాణ విమోచన దినోత్సవం''గా అధికారికంగా నిర్వహించాలని, "తెలంగాణ సప్త సంకల్పాలు" అమలు చేయాలని కోరుతూ కీసర మండల ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17ను తెలంగాణ చరిత్రలో మరువలేని రోజుగా, నిజాం పాలన, రజాకార్ల దురాగతాలు, జమీందారీ దోపిడీ నుంచి విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక దినంగా పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ రాజకీయ సంకల్పం, ఆపరేషన్ పోలో కీలక పాత్ర పోషించాయని, అమరవీరుల త్యాగాలను గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. తెలంగాణ సప్త సంకల్పాలు రాష్ట్ర ప్రభుత్వ అమలు చేయాలని

1. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17ను అధికారికంగా ''తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహించాలి.
2. హైదరాబాద్‌లో సర్దార్ పటేల్‌కు "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ -- తెలంగాణ" నిర్మించాలి.
3. హైదరాబాద్‌లో "హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం" ఏర్పాటు చేయాలి.
4. ప్రతి జిల్లా కేంద్రంలో "తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం" ఏర్పాటు చేయాలి.
5. పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర చేర్చి, అమరవీరుల అధికారిక జాబితా రూపొందించాలి.
6. బైరాన్‌పల్లి, పరకాల వంటి చారిత్రక ప్రాంతాల్లో విమోచన స్మారక స్తూపాలు నిర్మించాలి.
7. చారిత్రక గ్రామాలు, కోటలు, పోరాట కేంద్రాలను అనుసంధానిస్తూ "తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్" అభివృద్ధి చేయాలని ఎమ్మార్వో ని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మునిగంటి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యామ్ సుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరం లక్ష్మి, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎలసాని నాగరాజ్ యాదవ్, రామారం గిరి గౌడ్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, సూర్య శేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్, భరత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో ఆర్యవైశ్య ఆత్మ గౌరవ భావన నిర్మాణ భూమి పూజ...

## --ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ---ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి, ఉప్పల్ జెడ్ సి రాధిక గుప్తా

## రూ. 30 కోట్ల వ్యయంతో వైశ్యు ఆత్మ గౌరవ భవనం నిర్మాణం

## తెలంగాణకే గర్వకారణం కీసర బిలిదే రమేష్ గుప్తా..





**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఉప్పల్ భాగాయత్ లో ఈనెల 13న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఆత్మ గౌరవ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. ఈ భవన నిర్మాణం కోసం ఆర్య వైశ్యుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ బగాయత్ లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గత వారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తాల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ హాజరై ఈనెల 13న ఉప్పల్ భగయత్ లో నిర్వహించతలపెట్టిన భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. తమ జిల్లాలో రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఆత్మ గౌరవ భవన నిర్మాణం జరగడం ఎంతో గర్వంగా ఉందని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా నుంచి సుమారు ఐదు వేల మంది ఆర్య వైశ్యుల తరలిరావాలని వారు పిలుపు నిచ్చారు. ఈనెల 13న ఉదయం ఎనిమిది గంటలకు భూమి పూజ స్థలంలో శ్రీ శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న దంపతులు పాల్గొనవచ్చునని వారు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్న సందర్భంగా ఉప్పల్ బాగాయత్ లో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్యవైశ్య మహాసభ నిర్వాహకులకు వారు సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆర్య వైశ్యుల ఐక్యతను చాటుకోవాలని నిర్వాహకులు కోరారు.

# నాగారం డివిజన్ లో భర్త ప్రోత్సాహం తో భార్య పిహెచ్డి..

## కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్డీ సాధించినా దీపా బానోత్ ...




**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం ఉస్మానియా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని డా. దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం. డా.దీపా బానోత్ "తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం (తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం)" అనే అంశంపై పరిశోధన జరిగింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి .సమున్నత పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను (పెద్ద కుమారుడు మరియు చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాధ్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త రవి తేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు. ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# అంకిరెడ్డిపల్లిలో నిరాశ్రయులైన అంధ వృద్ధ దంపతులకు అండగా సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్..



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ అంకిరెడ్డిపల్లి గ్రామంలో 85 ఏళ్ల వృద్ధుడు ఏ. స్వామి (కంటి చూపు లేని అంధుడు), ఆయన భార్య శివమ్మ దంపతులు ఇద్దరికీ ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు లేకుండా, ఇల్లు లేకుండా రోడ్డు పక్కన కంబళి కప్పుకొని జీవిస్తున్న దుస్థితిపై కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ స్పందించారు. వృద్ధ దంపతులకు బట్టలు, వారికి సరిపడా వస్త్రాలు, తిండికి కావలసిన నిత్యావసర వస్తువులు అందించడం జరిగిందని, సహాయ సహకారం అందించడానికి ముందుంటానని సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ తెలిపారు. గత పదేళ్లుగా అంకిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఈ వృద్ధులకు తిండి, ఆహార పదార్థాలు ఇస్తున్నారు. ఇది మన అంకిరెడ్డిపల్లి గ్రామం యొక్క గొప్పతనం. మన ప్రజలకు సాయం చేసే గుణం ఉందని నేను గర్వంగా చెబుతున్నాను అని తుడం శ్రీనివాస్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు కి అక్కడే ఉండి ఫోన్ ద్వారా వృద్ధుల గురించి చెప్పడంతో ఆయన వెంటనే స్పందించారని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వృద్ధ దంపతులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు బుక్ మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈనెల 15వ తేదీ లోపు దివ్యాంగుల పెన్షన్లు ఆఖరి తేదీ కాబట్టి, ఆ తేదీ లోపు ఆధార్ కార్డు, బ్యాంకు బుక్ చేపిస్తానని వి. హనుమంతరావు హామీ ఇచ్చారని శ్రీనివాస్ పేర్కొన్నారు. వి. హనుమంతరావు కి, కీసర మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినట్లు శ్రీనివాస్ తెలిపారు.

# EMPEE డిస్టలర్స్ పరిశ్రమ ఎదుట ఉద్యోగుల ఆందోళన

**ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్**
**స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కేటగిరీలకు జీఓ నం.06 అమలు చేయాలని కార్మికుల ఆందోళన**



**చౌటకూర్, వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని జువీూజుజు డిస్టలర్స్ పరిశ్రమ ఎదుట పర్మనెంట్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరారు. తమకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ హక్కులు కల్పించడంలో యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కేటగిరీల కింద జీఓ నంబర్ 06ను యాజమాన్యం తక్షణమే అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా -- మందుముల పరమేశ్వర్ రెడ్డి

**మహమ్మద్ రషీద్ ఖాన్‌కు 60 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత.**
**పాల్గొన్నా కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్.**

ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన మహమ్మద్ రషీద్ ఖాన్ అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని నెమలి అనిల్ కుమార్ తెలుసుకొని,వారి పరిస్థితిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన పరమేశ్వర్ రెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేయడంతో ?60,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. మంజూరైన చెక్కును ఈరోజు మందుముల పరమేశ్వర్ రెడ్డి మహమ్మద్ రషీద్ ఖాన్ కి అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు జమీలా బేగం, మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, విలాయత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. తమ కుటుంబ పరిస్థితిని పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం అందేలా కృషి చేసిన నెమలి అనిల్ కుమార్ కి,సహకరించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి కి మహమ్మద్ రషీద్ ఖాన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఐరా హాస్పిటల్‌లో వైద్య నిర్లక్ష్యంపై ఫిర్యాదు నేపథ్యంలో అధికారుల విచారణ



**శంకర్‌పల్లి: వాస్తవ తెలంగాణ న్యూస్;** ఐరా హాస్పిటల్‌లో వైద్యం వికటించిందనే ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గురువారం ఆసుపత్రిని సందర్శించి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రాధిక మరియు మెడికల్ ఆఫీసర్ డా. రేవతి ఆసుపత్రిలోని సంబంధిత రికార్డులు, రోగి వైద్య వివరాలు, చికిత్సకు సంబంధించిన పత్రాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విచారణలో భాగంగా ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది నుంచి వివరాలను సేకరించిన అధికారులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి నివేదికను సిద్ధం చేశారు. విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా సమగ్ర నివేదికను తయారు చేసి, తదుపరి చర్యల కోసం సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులు తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమల తయారీ -- తారా ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమలు




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి, జిల్లా సెప్టెంబర్ 11 2026 తారా ప్రభుత్వ కళాశాల ూసంగారెడ్డిలో ఈకో క్లబ్ ఆధ్వర్యంలో "జశ్రీమ్ఖఅ ఖఅస +తీవవఅ ఋఎజూబం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ మాట్లాడుతూ, మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి పూజించడం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల సహజమైన మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించడం పర్యావరణహితమైన విధానమని తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ కన్వీనర్ డా. బి. సోఫియా రాణి, వైస్ ప్రిన్సిపాల్ డా. సుచిత్రా సింగ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారుమట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు మన ఆరోగ్యానికి మేలఅనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు. కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ మరియు ప్లాస్టిక్ రసాయన రహిత పండుగల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



**వాస్తవ తెలంగాణ సెప్టెంబర్ 11 నాగరాజ్ యాదవ్ ప్రతినిధి** తూప్రాన్: వినాయక చవితి సందర్భంగా తూప్రాన్ పట్టణంలో నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో భాగంగా తూప్రాన్ పెద్దచెరువు నిమజ్జన ప్రాంతాన్ని ఆర్డీఓ తూప్రాన్, డీఎస్పీ తూప్రాన్, సీఐ తూప్రాన్, ఎంఆర్ఓ, మున్సిపల్ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వాహనాల రాకపోకలు, విగ్రహాల నిమజ్జనం సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.